క్లుప్తంగా

నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాస్



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్‌గా చెరువు శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కమిషనర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలసి జాయినింగ్ లెటర్ అందించారు. నరసాపూర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఆయన బదిలీపై గుంటూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ గా వచ్చారు. గతంలో ఇక్కడ డెప్యూటీ కమిషనర్ గా పనిచేసిన డి. శ్రీనివాస్ డీఎంఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లడంతో గత కొద్ది నెలలుగా ఈ పోస్ట్ ఖాళీగా ఉంది. ప్రభుత్వం ఇటీవల చేసిన బదిలీల్లో శ్రీనివాస్‌ను గుంటూరుకు కేటాయించింది.

ఆలయ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ



ఆలయం సిబ్బందితో రామచంద్రప్రసాద్, సీతాదేవి దంపతులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ వేదికపై శ్రీరామనవమి పురస్కరించుకుని సేవాతత్పరులు రామచంద్రప్రసాద్, వడ్డాది సీతాదేవి దంపతులు ఆలయ సిబ్బందికి నూతన వస్త్రాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దంపతుల్ని విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య తదితరులు అభినందించారు.

ఆశ్రమాల్లో విజిలెన్స్ తనిఖీలు



నగరంపాలెం: నగరంలోని అనాథలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల సంరక్షణ కోసం నిర్వహిస్తున్న సెంటర్లను శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. తెనాలిలోని జేఎంజే స్వధార్ హోం, పెదకాకానిలోని ఉజ్వల హోం, జేఎంజే పాఠశాల, పట్టాభిపురంలోని మాతృశ్రీ చిల్డ్రన్ హోంలలో తనిఖీలు చేశారు. ఆయా కేంద్రాల్లో సిబ్బంది పనితీరు, హాజరు, మౌలిక వసతుల్ని పరిశీలించారు. తనిఖీల్లో డీఈఈ రవికుమార్, సీఐ లక్ష్మారెడ్డి, తహసీల్దారు కె.నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, ఎస్ఐ రామచంద్రయ్య పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



బ్రహ్మారెడ్డి మృతదేహం

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 29వ తేదీ రాజాగారితోటలోని స్వాతి లాడ్జిలో జి. బ్రహ్మారెడ్డి అనే పేరుతో ఒక వ్యక్తి మంచాన్ని అద్దెకు తీసుకున్నాడు. 30వ తేదీ సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు సమాచారం అందుకున్నారు. పేరు బ్రహ్మారెడ్డి అని, క్యాటరింగ్ పనులు చేస్తుంటానని లాడ్జి నిర్వాహకులకు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతిపైన సుబ్బారెడ్డి నాన్న అనే పచ్చబొట్టు ఉందని, వేలుపై ఓం గుర్తు పచ్చబొట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నంబర్ 8688831320కు ఫోన్ చేయాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫిబ్రవరిలో పాతిమాపురానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన యువకుడు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెద్దలకు చెప్పవద్దని బెదిరించాడు. బాలిక ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లిదండ్రులు రెండు రోజుల కిందట ఆరా తీయగా, బాలిక జరిగిన విషయం చెప్పింది. తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థిని అదృశ్యం

గుంటూరు ఈస్ట్: విద్యార్థిని అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి మండలానికి చెందిన విద్యార్థిని చంద్రమౌళీనగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ చదువుతోంది. గురువారం రాత్రి హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధనే లక్ష్యం

మేయర్ కావటి శివనాగ మనోహర్, కమిషనర్ కీర్తి చేకూరి



స్వచ్ఛత గురించి ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్, కమిషనర్

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా ప్రజల భాగస్వామ్యంతో నగరపాలక సంస్థ కృషి చేస్తుందని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో స్వచ్ఛత మాషల్ మార్చ్ ర్యాలీని మేయర్, కమిషనర్ ప్రారంభించారు. తొలుత స్టేడియంలో వ్యర్థాల విభజన, హోం కంపోస్ట్, ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే వర్మి కంపోస్ట్ ఇవ్వడం, హోటల్స్, కల్యాణ మండపాలలో జీరో వేస్ట్ విధానంపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని పరిశీలించారు. నగరంలో అమలు చేయనున్న విధానంపై ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలంతా ఇళ్లల్లో వచ్చే వ్యర్థాల్ని తడిపొడిగా ప్రజారోగ్య కార్మికులకు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యర్థాల్ని కాల్వల్లో, రోడ్ల మీద వేసి అపరిశుభ్ర వాతావరణానికి కారణం కావద్దని కోరారు. నగరాన్ని స్వచ్ఛంగా, పర్యావరణ నగరంగా తీర్చిదిద్దుకోవడంలో నగరపాలక సంస్థకు ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ ప్రజారోగ్య కార్మికులకు సహకరించాలని కోరారు. అనంతరం మేయర్, కమిషనర్లు ర్యాలీలో పాల్గొని, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుకుమార్, ఎస్.ఎస్. సోమశేఖర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవీంద్ర నాయక్, అనిల్ కుమార్, వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు



వీధి కుక్కకు ఆపరేషన్‌ను పరిశీలిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో వీధి కుక్కల నియంత్రణకు నగరపాలక సంస్థ పటిష్ట చర్యలు తీసుకుంటోందని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. వార్డు సచివాలయాల వారీగా యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ)తో పాటు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని చెప్పారు. ఏటుకూరు రోడ్డులో శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏబీసీని ప్రారంభించారు. ముందుగా సెంటర్ లో ఆపరేషన్ థియేటర్, సర్జరీ అనంతరం కుక్కల్ని ఉంచే హాల్స్, పరిసరాల్ని మేయర్, కమిషనర్లు పరిశీలించారు. సెంటర్‌లో సీసీ కెమెరాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రజలు వీధి కుక్కల వల్ల ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా నగరపాలక సంస్థ వాటి నియంత్రణతో పాటు వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసేలా సెంటర్‌ను ఆధునీకరించామని తెలిపారు. సెంటర్‌లో సర్జరీ అయిన కుక్కలకు ఆరోగ్యం కుదుట పడే వరకు సంరక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆధునీకరించిన ఏబీసీ సెంటర్‌లో ప్రతి రోజు సుమారు 50 కుక్కలకు సర్జరీలు చేయడానికి వీలు ఉందని, అందుకు తగిన విధంగా అధునాతన వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో వీధి కుక్కల్ని గుర్తించి, వాటికి తప్పనిసరిగా ఏబీసీ, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. కుక్కలకు సర్జరీలు, అనంతరం సంరక్షణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకునేలా కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, డీఈఈ హనీఫ్, ఏఈ దుర్గా ప్రసాద్, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆనంద కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏడుకొండలు, అంగడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవల్ని విస్తృత పరచాలి

మచిలీపట్నం పోర్ట్ ట్రస్ట్ కార్పొరేషన్ ఎండీ విజయశంకర్



బ్రాంచిని ప్రారంభిస్తున్న విజయ శంకర్, శంకర ముత్యం, రోహిణి కుమార్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ఖాతాదారుల సౌకర్యార్థం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవల్ని మరింత విస్తృత పర్చాలని మచిలీపట్నం పోర్ట్ ట్రస్ట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యల్లాప్రగడ విజయ శంకర్ సూచించారు. నగరంలో 17వ శాఖను కొత్తపేటలోని ఫ్యాన్సీ మర్చంట్స్ కల్యాణ మండపంలో నాజ్ సెంటర్ బ్రాంచి పేరుతో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ కొద్ది సంవత్సరాల్లోనే ఊహించినంత అభివృద్ధి సాధించిందని తెలిపారు. సేవలో సామాన్య, మధ్యతరగతి వర్గాల సంక్షేమాన్ని, ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. బ్యాంక్ సర్కిల్ హెడ్ శంకర ముత్యం మాట్లాడుతూ కేవలం 25 ఏళ్లలో బ్యాంక్ చైర్మన్ శశిధర్ జగదీష్ నేతృత్వంలో రూ.2 లక్షల కోట్ల వ్యాపార అభివృద్ధిని సాధించిందని తెలిపారు. గృహ, వాహన, విద్య, వైద్య, పారిశ్రామిక, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు అత్యధికంగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 365 శాఖలతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీతో పాటు అన్ని రకాల ప్రభుత్వ ఆర్థిక సేవలలో హెచ్‌డీఎఫ్‌సీ బాధ్యతల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలసి వ్యవసాయం,అనుబంధ రంగాలకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ క్లస్టర్ హెడ్స్ చెరుకూరి రోహిణికుమార్, కోనంకి రాజేంద్రప్రసాద్, ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శేష ప్రభాకరరావు, రామకృష్ణ, బ్యాంక్ మేనేజర్ గాలి శ్రీనివాసరావు, పలువురు ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత గుమ్మడి రాధాకృష్ణ

మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్



రాధాకృష్ణ కుమారుడు రమేష్ చంద్రకు పురస్కారం అందిస్తున్న బుద్ధప్రసాద్

పాత గుంటూరు: ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాల్లో గుమ్మడి రాధాకృష్ణమూర్తి సేవలు వర్తమాన, భవిష్యత్తు తరాలకు ఆదర్శప్రాయమని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వధర్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో ధర్మజ్యోతి -2023 పురస్కార సభను ఘనంగా నిర్వహించారు. దివంగత గుమ్మడి రాధాకృష్ణమూర్తి జీవిత ముఖ్య ఘట్టాల ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. సభకు స్వధర్మ సేవా సంస్థ అధ్యక్షుడు కొరప్రాటి రామారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్‌లోని మురికి గుంటను సుందర దేవాలయ సౌధంగా మార్చడంతో పాటు గుంటూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మహాప్రస్థానాలు ఏర్పాటు చేయడంలో కర్మయోగిగా రాధాకృష్ణమూర్తి జీవితం సార్థకం చేసుకున్నారని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి కుమారుడు రమేష్ చంద్రకు ధర్మజ్యోతి- 2023 పురస్కారంతో పాటు లక్ష రూపాయలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, స్వధర్మ సేవా సంస్థ కార్యదర్శి తూనుగుంట్ల సుందర రామయ్య, స్వధర్మ సేవా సంస్థ కమిటీ సభ్యులు, నగర ప్రముఖులు, రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

బాలుడి కడుపు నుంచి బాల్ పిన్ తొలగింపు



ఎండోస్కోపీ చేసిన అనంతరం బాలుడు భార్గవ్‌తో డాక్టర్ నాగూర్‌బాషా, వైద్య సిబ్బంది



బాల్ పిన్

గుంటూరు మెడికల్: ఆటలు ఆడుకుంటూ బాల్ పిన్ నోట్లో పెట్టుకుని మింగిన బాలుడి కడుపు నుంచి సకాలంలో దాన్ని బయటకు తీసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. స్థానిక గుంటూరువారితోట ఏడో లైనులోని కేర్‌వెల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా చుండూరు గ్రామానికి చెందిన కె.కోటేశ్వరరావు, శిరీషల ఐదేళ్ల కుమారుడు భార్గవ్ ఇంట్లో గురువారం రాత్రి 9 గంటల సమయంలో పుట్ బాల్ పిన్ నోట్లో పెట్టుకుని ఆటలాడుతూ మింగేశాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో బాలుడిని గుంటూరు కేర్‌వెల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాల్‌పిన్‌ను చిన్నపేగులో ఇరుక్కు పోయినట్లు గుర్తించి, వెంటనే తొలగించామని డాక్టర్ నాగూర్‌బాషా చెప్పారు. సాధారణంగా పొట్టలో కాకుండా చిన్నపేగుల్లో ఏదైనా వస్తువు ఇరుక్కుపోతే తప్పనిసరిగా పెద్ద ఆపరేషన్ చేయాల్సి వస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉండటంతో ఎండోస్కోపిక్ ద్వారా బాల్ పిన్‌ను కేవలం పది నిమిషాల వ్యవధిలో బయటకు తీశామని వివరించారు.

పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

అధికారుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా నిర్దేశిత గడువు మేరకు జరగాలని, ఇంజినీరింగ్ అధికారులు పనుల వేగవంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు.తన చాంబర్‌లో శుక్రవారం నగరంలో అభివృద్ధి పనుల వేగవంతంపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో టెండర్ పొందిన పనులు నిర్దేశిత గడవు మేరకు జరగాలని చెప్పారు. ఎక్కడా జాప్యం లేకుండా ఇంజినీరింగ్ అధికారులు నేరుగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఏఈలకు చెప్పారు. సచివాలయ ఎమినిటి కార్యదర్శుల ద్వారా తమ పరిధిలో తాగునీటి సరఫరాపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో భాగంగా చేపట్టిన పలు అంశాల్లో ప్రజారోగ్య విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో జంక్షన్ అభివృద్ధి పనుల్ని యాక్షన్ ప్లాన్ ప్రకారం గడువు మేరకు పనులు చేపట్టాలని చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్ని త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులను గడువులోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఈఈలు సుందర రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శాంతి రాజు, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం



ర్యాలీలో సర్పంచ్ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ చల్లావారిపాలెంలో వారం రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సాంబశివరావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు గ్రామ సేవ చేయడం ఎంతో ముదావహమన్నారు. నీటి సంరక్షణపై ర్యాలీతో ఉపయోగం, సంరక్షణ, ఇంకుడు గుంతల ప్రయోజనాలు, వర్షం నీటిని ఒడిసి పట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్ని చైతన్యపర్చడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి కె. లక్ష్మి, ఉప సర్పంచ్ టి. శంకర్, గ్రామ పెద్దలు చల్లా వెంకటకృష్ణారెడ్డి, డి. కృష్ణారెడ్డి, ఆరుదల శ్రీనివాస్, టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

డాక్టర్ మండవ సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కుటుంబ నియంత్రణ విభాగం మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ మండవ శ్రీనివాసరావు మూడు దశాబ్దాలకు పైగా విలువైన సేవలు అందించారని సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి పేర్కొన్నారు. డాక్టర్ మండవ శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం కుటుంబ నియంత్రణ విభాగం వైద్యులు, వైద్య సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. కుటుంబ నియంత్రణ విభాగం నుంచి సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ఆయన్ను పూల వర్షం కురిపిస్తూ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ పేదల వైద్యుడుగా ఎంతో మందికి ఉచిత వైద్య సేవలు అందించారని తెలిపారు. పోలీసు సిబ్బందికి, మీడియావారికి సైతం డాక్టర్ మండవ గుర్తుండిపోయేలా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, డాక్టర్ శ్రావణ్, ఏపీఎన్జీవో నాయకురాలు రాధారాణి, నర్సుల సంఘం నాయకురాలు వెల్లంపల్లి పద్మజ పాల్గొన్నారు.

ఇండియన్ హెల్త్ కేర్‌తో హిందూ ఫార్మసీ కళాశాల ఒప్పందం



ఇండియన్ హెల్త్‌కేర్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుంటున్న రంగరాజు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం చెన్నైకు చెందిన ఇండియన్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. మెడికల్ కోడింగ్, మెడికల్ బిల్లింగ్ పోస్టుల భర్తీ కోసం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు వివిధ కళాశాలల నుంచి 144 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 120 మంది గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. వీరికి త్వరలో ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి, నియామకాలు కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ హెల్త్‌కేర్‌తో తమ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ హెల్త్‌కేర్ సంస్థ సీఈవో జె. శ్రీధర్, హెచ్ఆర్ మేనేజర్ మరియమ్, కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కె. రామలింగేశ్వరరావు, శర్మాస్ శ్రీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని పట్టాభిషేకం



కొరిటెపాడులో స్వామి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు, కమిటీ సభ్యులు



స్తంభాలగరువులోని రామాలయంలో పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు



గుంటూరువారితోటలో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: స్తంభాలగరువులోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో కమిటీ అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పారమాత్మిక హోమం, పట్టాభిషేకం, సాయంత్రం స్వామిని రథంపై ఊరేగింపు అనంతరం డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ కార్యదర్శి చల్లా జగన్నాథరెడ్డి, కోశాధికారి ఉడుముల శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి భీమినేని రాంబాబు, సభ్యులు పర్యవేక్షించారు.

- గుంటూరువారితోట రెండో లైనులో ఈమని ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక మండపంలో 36వ శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శ్రీ సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని ఉత్సవమూర్తుల్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భక్తి సంగీత విభావరి అలరించింది. శనివారం ఉదయం పూజల అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆంజనేయశర్మ తెలిపారు.
- కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం కోదండ రామ స్వామి నగరోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, దేవతా మూర్తుల వేషధారణలతో, భజన మండలి రామ నామ సంకీర్తనలతో నగర వీధుల్లో ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమాల్ని ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పి. శ్రీనివాస్, బిజినేపల్లి మోహనరావు పర్యవేక్షించారు.

వైద్య రంగానికి సీఎం పెద్దపీట



డాక్టర్ బాబ్జి, డాక్టర్ సాంబశివారెడ్డితో డాక్టర్ షేక్

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మెడికల్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీలో శుక్రవారం వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బి. సాంబశివారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ రాజ్యలక్ష్మిని కలసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం డాక్టర్ వై. షేక్ విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో గణనీయ మార్పులు తెచ్చిందని తెలిపారు. పలు కళాశాలలు ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి వర్గాలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్య విద్యను చేరువ చేయాలనే సంకల్పం ఎందరికో స్ఫూర్తి నిచ్చిందని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతూ ప్రభుత్వ లక్ష్యాల్ని సమష్టిగా సాధిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసం చేసిన ఘటనపై బాధితుడు పోలీసుల్ని ఆశ్రయించాడు. బాలాజీనగర్‌కు చెందిన మల్లెల సురేష్‌కు ఇన్‌స్టాగ్రాంలో ఓ యువతి పరిచయమైంది. ఆమెతో స్నేహం పెరిగిన తరువాత ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే లాభాలు వస్తాయని నమ్మబలికింది. కొద్దిరోజుల పాటు సురేష్ పంపిన డబ్బుకనుగుణంగా లాభం వచ్చిందని తిరిగి అకౌంట్‌లో డబ్బులు వేసింది. ఈ క్రమంలో యువతిని నమ్మిన సురేష్ రూ. 22 లక్షల్ని పలు దఫాలుగా ఆమెకు చెల్లించాడు. ఆ తర్వాత సదరు యువతి డబ్బుల్ని ఇవ్వలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పాత గుంటూరు పోలీసుల్ని శుక్రవారం ఆశ్రయించాడు.

అకౌంట్‌లో డబ్బులు వాడుకున్న వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: బ్యాంకు అకౌంట్‌లో జమ అయిన ఇన్సూరెన్స్ డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ యాకోబ్ షరీఫ్ 2019 నుండి పీపుల్స్‌ట్రామా ఆసుపత్రిలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. అయితే 2019కు ముందు అన్వర్ హుస్సేన్ ఆసుపత్రి నిర్వహించేవాడు. ఈ క్రమంలో అన్వర్ హుస్సేన్ పేరుపైన కొత్తపేటలోని స్టేట్‌బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. అనంతరం కీసర వెంకటేశ్వరరెడ్డి ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కీసర వెంకటేశ్వరరెడ్డి పేరు మీద నాయుడుపేటలోని స్టేట్‌బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేసి ఆసుపత్రికి సంబంధించి లావాదేవీలు అకౌంట్ ద్వారా నిర్వహిస్తున్నాడు. ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులకు సంబంధించిన గుడ్‌హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నిర్వాహకులు రూ. 84వేలు కొత్తపేట బ్రాంచ్‌లో ఉన్న అన్వర్ హుస్సేన్ అకౌంట్‌లో జమ అయ్యాయి. అయితే, నగదు వాడుకున్న అన్వర్ హుస్సేన్ నగదు ఇవ్వనని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఆసుపత్రి అకౌంటెంట్ యాకూబ్ షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.